
# వెలుగులోకి పయనం

జి. మనోజమ్మ



**అబ్బులుగాడిని పెదరెడ్డింట్లో పనికి రమ్మని రెండ్రోజులుగా తెగ పోరుతున్నారు రంగి, సుబ్బడు. వాడు "రాను గాక రాను ... బడికి పంపీండి, సదూకుంట!" గట్టిగా అంటున్నాడు.**

"గొప్పోల్లకురా సదూలూ ... మనంటోల్లకు కాదు ... యినవేం!" సుబ్బడు కొడుక్కి సమజ్జెయ్యడానికి మంచిగా చెపుతున్నాడు.

"ఐతే టౌన్లకెల్త ... పంపీండి. ఆడ్నే పని చూసుక్కుంట!" మొండికేస్తున్నాడు అబ్బులు.

"టౌన్లకెల్తవేం? పెద్దోనివైనవా ....! దిమాక్ కరాబైందేందిరా?"

"ఆల్లింటికి పనికి రమ్మంటున్రు. మల్ల ఆడకైతే పెద్దోన్వా?"

అబ్బులు మొండితనం చూసి సుబ్బడు రాత్రి నాలుగంటించాడు. కూడు తినకుండా అట్లనే ఏడుస్తూ ముడుసుకుని తొంగున్నాడబ్బులు.

పొద్దుటాల రెడ్డోరింటికాడ పన్జేసుకొచ్చిన రంగి కొడుకుని లేపింది. "సూడమ్మా, అబ్బులుకొండా! పెద్రెడ్డి నిన్ను తోల్కొని గబుక్కున రమ్మన్నడు. పసులకాడికి కాదంట్లేరా! పెద్రెడ్డికాడే ఉండి ఆరి పనులే చెయ్‌మన్నరు!"

"ఏం పన్లంట? కళ్లు తెరవకుండానే అడిగాడు తల్లిని."

"అదేరా ... ఆరికి సుట్టలు, సీసాలు తెచ్చిస్తు, గలాసులు యిత్తూ ఆరికాడే ఉంటానికి."

"ఆమద్దిన చాన్రోజులు నీతో వచ్చిన గదే! ఆరికి సుట్టలు, బుడ్లు తెచ్చిన. గలాసులు గలాసులు తాగి తాగి నాను కాల్లొత్తుతూంటే అట్టాగే తొంగునేటోడు. నాను ఒత్తి ఒత్తి చేతులు నొప్పులు పుట్టే, కునుకొచ్చి జర జోగితే గబుక్కున లెగిసి ఎదవ సచ్చినోడా నిద్రోతావా? అని కాల్తో ఎన్నిసార్లు తన్నిండ్రో ... నాను .... నాను ఆరింట్లో ఉండను! ఎప్పుడూ తిడ్తా తంతూంట్రు!" లేచి కూర్చుని కళ్లు, ముక్కులు తుడుచుకుంటూ చెప్పాడు. మళ్లీ రంగి చేతుల్ని పట్టుకుని,

"తెల్లారక ముందున్నంచీ చాకిరీ చేసినవ్ గదే ... యామైనా తిన్నవే మల్ల?"

తన తిండిని తిన్నదీ లేనిదీ అడిగిన బిడ్డను ఒడిలోకి తీసుకుంది రంగి. "అయ్యో బిడ్డా! నువ్వు తినకుండా నేన్ తింటాన్రా? ఇదో, రెడ్సాని సద్దికూడు పోసింది. నీకని తెచ్చినా! ఇంకా పని కాలె ... బేగెల్లాల ... లెగిసి తినమ్మ రవ్వ ... (ప్చ్ ... అని) మీ అయ్యకు ఇది కూడ నేదు. ఆడికి మద్దేనానికి వండిపెడ్తను. నువ్వు తీస్కపో అంది రెడ్సాని. లెగు, బిడ్డా!"

"మరమ్మా...! ఇంత కట్టపడ్తున్రు కదే! మీకే కూడు నేదు. నన్నూ రమ్మంట్రేంది? పక్క టౌన్లకెల్తా. యాడనో పన్జేస్త. పైసలు మీ క్యాడా పంపుత!" పదేళ్లు కూడా లేని గుంటడు ఏడుస్తూ చెపుతున్నాడు.

రంగికి గుబులౌతోంది. ఏడుపు తన్నుకొస్తోంది. పెద్రెడ్డి రోజూ అదేపనిగా అడుగుతున్నాడు.

"ఏవేఁ రంగీ! అబ్బులుగాడ్ని అంతపురంలో పెడ్తున్నవా ఏందే? ఆడు రోజూ వస్తే పేడ తీసి, పసులు దోల్తడు, రెడ్డమ్మకు కూరగాయులు గట్రా తెచ్చి చెయి తోడుంటడు. నాకూ సుట్టలూ అయీ తెచ్చి నా ఎంటే ఉంటడు. రోజూ తీస్కరా, అలవాటవుద్ది!" అని ప్రతిరోజూ పోరడమే.

ఈ దినం "పెద్దయ్యా ... ఆడు ... ఆడు ..." మాటలు పైకి రాలే.

"ఏందే నీ నసుగుడు .... మాటలు మింగుతున్నవ్! చెప్పేదేందో చెప్పేడువ్!"

"ఏం నేదు పెద్దయ్యా .... ఆడేమో ఆడుకొనే పిల్లడు. ఆడేం సేత్తడు మీ అసుంటి పెద్దోల్లకాడ! నానూ ... మీ పాలేరు చేత్తన్నం గందాని .... మాటలు నాన్చింది."

"మీరున్నారులే ... మరి వాడికి పనులు అలవాటయ్యేది ఎప్పుడే? ఇప్పటినుండి సెయ్యాల గదా! రేపు ని ఎంటే తీస్కరా!" అనేశాడు పెద్రెడ్డి.

'ఎందుకీ ఎదవ బతుకు? ఈడ గుంటడు రానని ఏడుత్తున్నడు. ఆ మాటింటే రెడ్డి ఆడి అయ్యను గొడ్డును బాదినట్టు బాత్తాడు. అబ్బులుగాని ఎముకలిరిచేత్తడు. ఓర్నాయనో ... నాకేటి దారి? ఉన్న ఒక నలుసును ఆరు మసి సేత్తరు' పైకి సూత్తూ లోపల్లోపల గొణుక్కుంటున్న తల్లిని ఊపుతూ

"అమ్మా ... చెప్పే ...! అయ్య నా మాటినడు. రానంటే నన్ను కొడ్తండు. నువ్వేనైనా చెయ్యి ... నన్ను టౌన్లకు పంపీ!"

"యాడకని పోతవు కొడకా? ఎవురింట్ల ఉంటవు? ఆడ్నీకు బువ్వెవురు పెట్తరు? ఇంత సిన్న గుంటడివి ... ఒక్కడివి ఎట్టుంటవు? ఈడేమో పెద్రెడ్డి కళ్లు నీమీన పడ్డయి. నిన్ను వదల్డు! నీ మాట్లు నిజమే అయినా ... ఈడుంటే మానాగే నీ బతుకూ ఈ మట్టిలోనే తెల్లారుద్ది. ప్చ్... ఏవిఁటో ... టౌన్లలకూడా శానా మోశాలుంటవంట. నీ అసుంటి పిల్లకాయల్ని కొట్టీ ... యింసలు పెట్టీ ఆళ్లతో పన్లు చేపిస్తరంట!"

"ఈడా అంతే గదే! మనల్ని కొడుతున్రు, బూతులు తిడుతున్రు. మొన్న మా అయ్య ఆరు కొట్టిన దెబ్బలు, తన్నుల్తిని కూడ ఒక్కనాడైనా ఇంట్ల తొంగున్నడా? అసుంటి గాయాల్తోనే పన్లకెల్లిండు గందా! మనకేడబొయినా చాకిరీ, తన్నులు తప్పవు!"

"వేదాంతం సెప్తవేందిరా అబ్బులుకొండా! ఆడ

నీకేమైనా జొరం గిరం వత్తే ఎవురు చూత్తార్రా?" తల్లి కళ్లనీళ్లు చూసి, అబ్బులు ఆమెను వాటేసుకుని....

"మా యమ్మ శానా మంచిది. ఒప్పుకుంది. అయ్యనూ ఒప్పీయమ్మా! నీ అసుంటి అమ్మ ఎవురో బువ్వ పెట్టుద్దే! గుబులు పడొద్దు. అయ్యకు సెప్పి సరేననేటట్టు చెయ్యమ్మా!"

"రేత్రికి సెప్తలేరా! నువు లెగిసి సద్దికూడు తిను, మల్లా! నేన్పొగెల్లాల!"

అమ్మిచ్చిన మాటతో అబ్బులు కుషీగా లేచి మొహం కడుక్కుని రంగి తెచ్చిన చద్దికూడు గిన్నెలో ఒంపి, ఉప్పు కల్లు వేసి, ఉల్లిగడ్డతో కూర్చున్నాడు. కలిపి తినటానికి చెయ్యి పెట్టాడు. మెత్తగా ఉంది.

"థూ....! పాసిపోయిన కూడు పోసింది. ఎట్ట తింట్రనుకుందో రెడ్డాని?" గిన్నెను ముందుకు తోశాడు అబ్బులు.

"అయ్యో, నా కొడకా! రేత్రి కూడా తిన్లేదు. ఏం తింటవురా? నాయన్నాయన జర తొంగో ... కాసిని నూకలు కాసిస్తా ... ఏం తినకపోతే పొట్ట నొప్పెడుతుంది ... బేగ వస్తనని సెప్పిన ... రెడ్డాని చిందులు తొక్కుద్ది!" గొణుగుతూ పొయ్యి రాజేసింది రంగి.

రాత్రంతా సుబ్బడు, రంగి బాగా సోచాయించిన్రు. ఇద్దరూ ఓ మాటనుకున్నారు. తొలి కోడి కూస్తునే లేచి సుబ్బడు అబ్బుల్ని వెంట తీసుకుని చెరువుగట్టుదాక తోలుకొచ్చాడు. బస్సు టిక్కెట్టుకు, ఇంకా కూసిని పైసలు చేతికిచ్చి, జాగ్రత్తలు చెప్పి అప్పుడే వచ్చిన బస్సులో ఎక్కించాడు. బస్సు కనపడేదాక నిల్చుకోని అబ్బులు సంగతి పెద్రెడ్డికి ఏవని చెప్పాలా అనీ గుబులు పడుతూ పల్లెదారి పట్టాడు సుబ్బడు.

ooo

టౌన్ల బస్సు దిగిన అబ్బులుకు కొత్త పెపంచకంలో అడుగుపెట్టినట్లయింది. పల్లె తప్ప మరో సోటు సూల్లేదు. ఆ మాడ్గీలు, అంగళ్లు, పెద్ద రోడ్డులు ... అంతా ఇసిత్రంగా సూసిండు. రోడ్డుపక్క ఇడ్డెన్లమ్ముతున్నారు. నాలుగిడ్డెన్లు తిని కడుపు నిండుగా నీళ్లు తాగిండు. సందేళదనకా కనిపించే అంగళ్లు, ఓటళ్లు, ఇళ్లలోను అన్నిసోట్లా ఏమైనా పని ఇప్పించమని అడుగుతూనే ఉన్నడు. ఆ పిల్లడికి ఎవురిస్తరు పని? చీకటి పడింది. ఆకలైతుంది. పొట్టలో నొప్పెడ్తోంది.

'పొట్ట నొత్తుందిరా అబ్బులుకొండా, రవ్వ తినమ్మా! అని గడ్డం పట్టుకుని బతిమాలే అమ్మ యాదొచ్చింది. జేబులో పైసలు సూసినాడు. రెండు రూకలున్నయ్. రోడ్డు పక్కన బండీలో ఇడ్డెన్లు, పూర్లు అమ్ముతున్నరు. మంది తింటన్నరు. ఆశగా ఎల్లిండు బండికాడికి.

"పూర్లెంతయ్యా?"

"ప్లేటు మూడ్రూపాయలు!"

"నాకాడన్ని పైసలు లేవు ... అర పిలేటు ఇస్తవా?"

"ఎందుకీను? ... ఇదిగో అర ప్లేటు .... రూపాయి యాభై పైసలు ఇవ్వు!" ఆ బండబ్బాయి పిల్లాడి మూహం చూసి జాలితో రెండు పూరీలు ఎక్కువేసిచ్చాడు. పూర్లు ఆబగా తిని రొండు గలాసులు నీళ్లు తాగిండబ్బులు. కడుపు నిండినట్టయింది. పొద్దుటేలనుంచీ రోజంతా తిరిగి తిరిగి కాళ్లు పీకుతున్నై. కళ్లు కూడ మూసుకుంటున్నాయి. యాడైనా ఓ మూలన పడి నిద్దరోతే మంచిగుండు! జాగా సూస్కుంటూ రోడ్డెంబడి ముందుకు బోయిండు. ఎన్ని బస్సులో ఒకసోట నిల్చుకున్నయి. ఒకపక్క పెద్రెడ్డింట్లో ఉండే ఆలులాగా పెద్దదిగా అరుగులేసి చానా మంచిగుంది. అరుగులమీద కొంద్రు, మూలల్లోను, గోడల పక్కగా కొంద్రు పడుకున్నరు. నాను నిద్దరపోవచ్చో ... లేదో ... ఎవురిని అడగాలో? బస్సు దగ్గరున్న ఒకాయన్ని అడిగిండు.

"అయ్యా! ఆ మూలన నాను పండుకుంటా!"

"అతను నవ్వుతూ ఇది బస్టాండు. ఎవరైనా కూర్చోవచ్చు, పడుకోవచ్చు. వెళ్లి పడుకో!" అన్నాడు.

ఆయన్నే సూస్తూ ఎల్లి బస్సుల స్టాండులో ఓ మూల గుడ్డసంచీ తలకిందెట్టుకుని నిద్రోయిండబ్బులు.

ఎండ సురక్కుమంటుంటే లెగిసి కూచున్నడు. ఈయాల యాడికెల్లడం? అయ్యిచ్చిన పైసలు రాత్రే సాల్లేదు. పని ఎవుర్ని అడగడం? పొట్టలో మల్లా నెప్పి. ఏందో మరి ... యిట్టా ఆకలేసి పొట్ట నెప్పి వస్తా ఉంది. అమ్మే గవనానికొస్తంది. అమ్మేమో అయ్యతో పంపేతపుడు 'అబ్బులుకొండా! కట్టమేసినప్పుడల్లా దేముణ్ని అడుక్కో ... ఆ దేముడు నీకు సాయం జేత్తడు!' అనింది. నాకు అమ్మే గవనానికొస్తంది. దేముడు రాలే. ... ఆ చిన్న మనసులో ఎన్నో ఆలోచనలు. కళ్లంట నీల్లు కార్తున్నయి. పంపు నీళ్లతో కాళ్లు, ముఖం కడుక్కుని నీళ్లు తాగిండు. పొద్దున్నే నీళ్లు మింగేసరికి కడుపులో ఎట్టో అయి వాంతి రాబోయింది. కాల్లీడ్సుకుంటూ మల్లీ అంగళ్లముందు తిరిగుడు మొదలైంది. ఆ లైనులోనే చివరగా ఉండే టీ బంకు రాజయ్య నిన్నటినుండి పిల్లాడ్ని చూస్తున్నాడు. దగ్గరకు రమ్మని పిల్చాడు.

ఆశగా వెల్లాడబ్బులు ఏమైనా పని అడగొచ్చని.

"చాయ్ తాగుతావా?"

"వద్దయ్యా! ఎప్పుడూ తాగలా!"

"పోనీ బన్ను, బిస్కట్లు తిను!" ప్లేటులో బన్ను, బిస్కట్లు ఇచ్చాడు.

అబ్బులు కళ్లు నీళ్లతో నిండాయి.


"వద్దయ్యా! పైసల్లేవు!"


రాజయ్యకు అర్థమైంది ఇంట్లోంచి పారిపోయొచ్చిన పిల్లవాడని. పాపం, ఎంతాకలితో ఉన్నాడో ...

"పర్లేదు, తిను! బెంచీమీద కూర్చో!"

పిలేటు అందుకుని బెంచీపై కూర్చుని తింటూ వాళ్లమ్మ మాట్లను యాద్ చేసుక్కున్నడు. టౌన్లల్ల

తరువాయి 66వ పేజీలో...






..... 7వ పేజీ తరువాయి.

మోసాలు చేస్తరని, పిల్లకాయల్ని యింసలు పెట్టి పన్లు చెయ్‌పిస్తరని చెప్పింది. రేత్రి ఆ యన్న ఇన్ని పూర్లిచ్చిండు ... బస్సులు నిల్చిందగ్గర ఆ యన్నెవురో పోయి నిద్దరపో అన్నడు ... ఈడ ఈ యన్నేమో పైస్లు లేవన్నా యియన్నీ యిచ్చిండు! అమ్మెందుకట్టా చెప్పింది? ఆ చిన్న మనస్సులోని ప్రశ్నలకు ఎవరు సమాధానమివ్వగలరు?

సుబ్బరంగా పిలేటు కడిగి నీళ్లు తాగిండు.

"ఇప్పుడు చెప్పు, నీ పేరేవిటి? ఏ ఊరు నుండి వచ్చావు? ఎందుకొచ్చావు?" మంచిగా అడిగిన రాజయ్యతో ఏదీ దాచకుండా, నా పేరబ్బులు. మా యమ్మ నన్ను అబ్బులుకొండా అంటది... అని పేరుతో మొదలెట్టి టౌనుకు వచ్చినంతవరకు చెప్పి, "నువ్వే సెప్పయ్యా ... మా అయ్య పెద్రెడ్డింట్లో పాలేరు. అమ్మ, అయ్య రేత్రి, పగలు చాకిరి చేసినా మా అయ్య, అమ్మ, నేను రొండు పూట్లు తినలేము. ఒకపూట పస్తే ఉంటము. ఇగ నన్నూ రమ్మంటున్రు. ఆరి కుక్కనాగ ఆరెంటే ఉండాల్నంట! పారబాట్న కునుకేసినా తన్నులే! బాగా ఏడిచి, అమ్మనూ, అయ్యనూ ఒప్పించి ఈడకెల్లొచ్చినా. ఆ పెద్రెడ్డి మా ఓల్లను ఎంతింస పెడ్తుండ్రో నన్ను పంపిన్రని ... అయ్యా! నా కేడైనా పని సూపయ్యా, నీ కాల్మొక్త!"

రాజయ్య అబ్బులు చెప్పిన విషయాలన్నీ ఎంతో ఓపికగా విన్నాడు. "కాల్మొక్కొద్దు కానీ, సాయంత్రం చూద్దాం! చాయ్ కొస్తున్నరు ... వాళ్లకేం కావాలో చూడు మరి!"

"అలాగేనయ్యా!" తన సంచిని ఓ మూలన జాగ్రత్తగా పెట్టుకుని, టీ కప్పులు, సాసర్లు సుబ్రంగా కడిగి బోర్లించిండు. రాజయ్య టీ కలిపి ఇస్తుంటే అడిగినవారికి ఇస్తున్నడు. కేకులు, బిస్కట్లు, బన్నులు ఎవరు ఏదడిగితే దానిని టకటక ఇచ్చేస్తున్నడు. సాయంత్రంలోపల బంకులో పిల్లాడే అనుకుని, వచ్చినవాళ్లు అబ్బులునే పిలిచి ఆర్డర్లు ఇవ్వటం, పైసలెంతని అడగడం, అబ్బులు రాజయ్యనడిగి వారి దగ్గర వసూలు చేసి రాజయ్య చేతికివ్వడం జరిగింది.

ఈ పనులన్నీ రాజయ్యే చేసుకునేవాడు. ఈరోజు అబ్బులుండడంతో ఎంతో భారం తగ్గినట్లయింది. రాజయ్యకు. మధ్యాహ్నం పక్కనున్న హోటల్లో అన్నం తినిరమ్మని డబ్బులిచ్చి పంపాడు రాజయ్య. రాత్రి బంకు మూసేవేళైంది.

"అబ్బులూ! బయటున్న మన వస్తువులు, బెంచీలు, కుర్చీలు, బల్లు అన్నీ లోపలెయ్యాల. చిన్నవన్నీ వెయ్యి. బెంచీలు పడదాం! బంకు మూసెయ్యాల." రాజయ్య చెప్పడంతో కుర్చీలన్నీ జాగర్తగా చూసి లోనేస్తూ, కుర్చీకింద పడున్న పర్సు తీసి తెరిచి చూసిండు. 'ఎన్ని పైసల నోట్లో! ఆశ్చర్యపోతూ అట్టాగె పట్టుకుని పైసలు లెక్కెడుతున్న రాజయ్యకాడికి "అయ్యా! పరుసు ... పరుసు ...!" అంటూ లగెత్తిండు.

"ఎక్కడిది?"

"బైట మన బల్లకిందున్నదయ్యా!"

పర్సు తెరిచి చూసి, "చూశావుగా అబ్బులూ! చాలా డబ్బుంది. నీ దగ్గర డబ్బుల్లేవు. పర్స్ నీకే దొరికింది కనుక ఇది నీదే! తీసుకో!" పర్సు ఇవ్వబోయాడు.

గబుక్కున నోటిపై చెయ్యెట్టుకుని,

"అదేందయ్యా! దొరికింది నా దవుడ్దా! నాది కాదు. ఇందనక ఆ బల్లమీన కూసుని చాయ్ తాగి పైసలిచ్చిన్రు, ఆళ్లదే! వాళ్లు ఇళ్లకు బోయి పర్సు సూసుకుని, రేపు మన బంకుకాడకు వస్తరు. ఇద్దాం. పాపం, పరుసుకోస మెంత దేవులాడ్తుండ్రో...!"

అబ్బులు మాటల్లోని నిజాయితీ చూసి అబ్బురపడ్డాడు రాజయ్య.

"అలాగే ఇద్దువుగాని, సంచి తీసుకుని పద, బంకుకు తాళమేస్తాను!"

రాజయ్య పక్కనున్న అబ్బులు భుజంపై చేయివేసి దగ్గరగా తీసుకుని నడుస్తూ,

"అబ్బులూ! నా దగ్గరుంటావా మరి! నాతోనే ఉండి ఈరోజు చేసిన పనులే చెయ్యాలి. ఇంటిదగ్గర నా భార్య ఉంది. నిన్ను తమ్ముళ్ళా చూసు కుంటుంది. మాతోనే ఉందువు!" అన్నాడు.

ఆ మాటలకి బోల్డంత సంతోసమై, రాజయ్య చేయి పట్టుకుని, "అయ్యా నాకింట్లో పన్లు కూడ వచ్చు. ఊడుత్తా, బొగ్గోన్లు తోమ్తా ... తవరే పని చెప్పినా చేత్తానయ్యా ...! పది రూకలు మా అయ్యవోల్లకు పంపి .... నాకింకేం వొద్దు!"

"ఎందుకు వద్దు? నెలనెలా కొంత డబ్బు నీ పేరుతో బాంకులో వేసుకుందువు, చదూకోవాలని ఉందన్నావు కదా. పలక, బలపం తీసి అక్షరాలు నేర్పిస్తా. బంకులో టైము దొరికినప్పుడు ఇంటికెళ్లాక అక్షరాలు దిద్దుకుని చదూకొందువు!"

అబ్బులు గబుక్కున రోడ్డుపైనే కాళ్లమీద పడబోయిండు "అయ్యా!" అంటూ. రాజయ్య పట్టుకుని లేపి, "అలాంటి పన్లు చెయ్యకూడదు. చూడబ్బులూ! మీ ఊర్లో పెద్రెడ్డింట్లో పని చెయ్యనన్నావు. మరి నా దగ్గర చేస్తా నంటున్నావెందుకు? నేను కూడా వాళ్లలానే నీచేత పనులు చేయించుకుంటున్నాను కదా!"

రాజయ్య మాటలు పూర్తి కాకముందే,

"మీరు అలాంటోల్లు కానే కాదయ్యా! ఆల్లు మనుసులే కారు. ఎదురుగా మేం ఉన్నా, పలారాలు తినేటోళ్లు. మాకు పాసిన అన్నం, పచ్చడికారం ఏసేటోళ్లు. మేమూ మనుసులమే అని ఆళ్లనుకోరు. నువ్వు నా ఆకలిని చూసి తింటానికిచ్చినవ్. పని ఇచ్చినవ్. మనిసిగా సూత్తున్నవ్ ... నువ్వు దేముడివయ్యా ... మాయమ్మ కట్టకాలంలో దేముడ్ని అడుక్కోమంది. దేముడే నాకు పనిచ్చిండు."

"తప్పు. అలా అనకూడదు. మనమంతా మనుషులమే! మనందరినీ కాపాడేవాడు దేవుడు. ఇకనుంచి నన్ను అన్న, అని పిలవాలి. సరేనా?"

అబ్బులు సంతోషంగా దేవుడిచ్చిన అన్న చేతిని గట్టిగా పట్టుకుని ధైర్యంగా ముందుకు నడిచాడు. ■